# ఘంటాపథం

శీతంరాజు చిట్టిబాబు

పురోహితుల వారు మంత్రాలు చదువుతూ, మధ్య మధ్య చేయాల్సిన విధులను నిర్దేశిస్తూ, బారసాల తతంగం కానిస్తున్నారు. పీటల మీద కొడుకు రామం, వళ్లో పసి వాడ్ని పెట్టుకొని కోడలు రజనీ, ఆయన చెప్పినట్లల్లా ఆచరిస్తున్నారు.

కావాల్సిన వస్తు సామాగ్రి, ఫల పుష్పాదులు, తాంబూలాలు, నూతన వస్త్రాలు, అన్నీ అడగ్గానే అందించగల విధంగా అమర్చుకుని మాలతి, తను కొడుకూ కోడళ్లకు అందుబాటులో కూర్చుంది.

ముఖ్యమైన బంధువులు, స్నేహితులు, దగ్గిర యిళ్లలోని సన్నిహితులు చాలా మందే వచ్చారు. కొడుకు ప్రథమ సంతానపు బారసాల అవటంతో, మాలతీ సుందరరావులు ఆనందంతో ఘనంగానే అన్ని యేర్పాట్లు పెద్ద యెత్తున చేశారు.



ముసలితనం ముంచుకు వస్తున్న అక్కా బావలు, ముందు వరుసలో ఒక ప్రక్కన కుర్చీల్లో కూర్చుని, తెలిసిన వారినల్లా పలకరిస్తూ చాలా సంతోషంగా ఉండటం చూచి, మాలతికి యెక్కడ లేని తృప్తి కలిగింది. పీటల మీద కూర్చునేప్పుడే కొడుకు కోడలు చేత వాళ్లకు బట్టలు పెట్టించింది. వాళ్లంటే కుటుంబంలో అందరికీ గౌరవమే. అందుకే మనవడికి తన బావ పేరు పెడదామని తనతో పాటు అందరు అనుకున్నారు.

తండ్రి పోవటం వల్ల అక్కా బావలే తన పెళ్లి చేశారు. వాళ్లని తన తల్లిదండ్రులతో సమానంగా గౌరవిస్తూ వస్తోంది. ఇప్పుడు ఆలోచనలన్నీ పాత జ్ఞాపకాల్లోకి వెళ్లినై.

కొన్ని కుటుంబాలు ఉన్నత స్థితి నుంచి దిగువకు, కొన్ని దిగువ నుంచి ఉన్నత స్థితికి, అదృష్ట చక్రం తిరుగుతూ ఉంటే అవరోహణ ఆరోహణ క్రమాలు పొందుతాయి. తన తండ్రి అమాయకత్వం, తల్లి తెలివి తక్కువ తనాల వల్ల పెద్దలు సంపాదించి యిచ్చిన 18 ఎకరాల మాగాణి, 75 వేల రూపాయల సెక్యూరిటీ బాండ్లు, అంతులేని వెండి బంగారాలు హారతి కర్పూరాలైనై. ఉన్నయిల్లు కూడా తాకట్టులోకి వెళ్లింది. ఆ పతనానికి చదువబ్బని మామయ్య, ఆయన దుష్ట స్నేహితుడు కారకులు. వ్యాపారంలోనికి దింపి, ఒకసారి రెడీమేడ్ దుస్తుల షాపు, యింకో సారి భారీ ఫొటో స్టుడియో పెట్టించారు. ఎప్పుడూ నష్టాలే. ఆఖరికి వాళ్ల వ్యసనాలు కాటన్ మార్కెట్‌లోకి దిగినై.

అదృష్ట వశాత్తు అక్క, పెళ్లి జరిగి, కుటుంబ స్థితి దిగజారకముందే కాపరానికి వెళ్లింది. బావ పెట్టు పోతలుగాని, ఆస్తి పాస్తులుగాని ఆశించని ఉత్తముడు, స్వతంత్రుడు అదృష్టపు రాకపోకలు మనుష్యుల చేతుల్లో ఉండవనే మనస్తత్వం కలవాడు. హైదరాబాదులో ఉద్యోగం చేస్తూ

నలుగురి చేత మంచివాడనిపించుకొనేవాడు.

పెళ్లయిన కొత్తల్లో, యింట్లో ఉన్న నిలువుటద్దపు బీరువా, కుర్చీలతో రౌండు టేబులు, డబుల్ కాటు వగైరాలన్నీ తెస్తానని అక్క అంటే, యేం వద్దు, ఒకమంచి చీరె, జాకెట్టు కట్టుకుని వచ్చేయి, చాలు అన్నాడు. బావ. ఇద్దరమ్మాయిలే ఉన్న యింటికి పెద్ద అల్లుడిని అని అనుకోవటం గాని, యింటి పరిస్థితులు తెలుసుకుంటూ ఉండాలనే కోరిక గాని ఉండేవి కావు బావకు.

కుటుంబానికి పట్టిన దీనావస్థ చూసి మామయ్య నిశ్చ్యమించాడు. పరిస్థితులు అవగాహనకు వచ్చి తల్లిదండ్రులతో పాటు తనూ బాధ పడటం మినహా చేయగలిగిందేమీ లేకపోయింది. చదువుతున్న సెవన్తు ఫారం అవగానే ఉద్యోగం చేయాలనుకుంది. తను. తన కెట్లా పెళ్లి చేయాలా అన్నదే తల్లి తండ్రుల తాపత్రయంగా ఉంది.

దురదృష్టం తోడై తండ్రి మంచాన పడ్డాడు. తను పరీక్ష తప్పింది. కుటుంబం గడవటమే కష్టమయింది. అక్కా బావల సహాయం కోరటానికి తల్లిదండ్రులు సిగ్గు పడ్డారు. బాగా ఉన్నపుడు మంచి మనసుతో పెద్దగా పెట్టు పోతలుగాని, గట్టిగా ముద్దు ముచ్చట్లుగాని జరపలేదు. అటువంటి ఆలోచనలే ఉండేవి కావు.

పాతికేళ్ల క్రిందటి పరిస్థితి అది. ఆ స్థితిలో తను గట్టి ధైర్యం చేసింది. అక్కా బావల దగ్గిరకు వెళ్లి కళ్ల నీళ్లతో పరిస్థితంతా చెప్పింది. పూనుకుని అంతా మేనేజ్‌చేసి; కుటుంబాన్ని వడ్డున పడెయ్యాలంది. అప్పటికి గాని బావ చలించలేదు.

ఆలోచించి గౌరవంగా ఒక కండిషన్ పెట్టాడు. "సర్దుబాట్లు జరిగి పరిస్థితులు అనుకూలించేటంత వరకు మా యింట్లో మేము ఉంటాము. మా యింట్లో మీరు తింటారు" అని వెంటనే ట్రాన్సఫరు చేయించుకుని, బావ అక్కా పిల్లలతో వచ్చేశాడు.

మరుసటి నెలలోనే తండ్రి పోవటంతో కుటుంబ స్థితి మలుపు తిరిగింది. పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లికి, తనూ, అక్కా ప్రక్కన ఉండగానే ధైర్యం చెప్పాడు బావ, ఆమె కూడ తన కుటుంబంలో అప్పటి నుంచి ఒక సభ్యురాలేనని. చదువుకున్నంత వరకు తనను చదివించి పెళ్లి చేసి పంపిస్తానని తనతో అన్నాడు.

తను సెవన్తు ఫారం పూర్తి చేయలేక చదువాగిపోయింది. పెళ్లి ప్రయత్నాలు ఆశా భావంతోను సహనంతోను జరుగుతున్నా, కొందరు అయిన వాళ్లు కాని వాళ్లు కూడా జాలిపడటం పోయి యిబ్బందికరంగా మాట్లాడుతూ ఉండేవారు.

ఇల్లరికం వచ్చిన అల్లుడుగా బావను చిత్రీకరించారు. పెళ్లీ పెటాకులు లేకుండా తనను, యింట్లో పని మనిషిని చేసి యిల్లు స్వంతం చేసుకుంటాడన్నారు. అక్క సహజంగా బావనే సమర్థిస్తుంది. అదీ కాక యిప్పటికీ గుర్రుగా ఉండి, అమ్మా నాన్నలు ఆస్తులు తెలివి తక్కువగా నాశనం చేశారని గుణుస్తోందన్నారు.

ఎవరు యేమాట మాట్లాడినా, యే పని చేసినా, వాటికి వ్యతిరేకార్థాలు తీసి అయిన వాళ్ల మధ్య చిచ్చు పెట్టగల సమర్థులున్నారు మరి. ఎప్పుడన్నా తను యిల్లు ఊడుస్తున్నా, కూరలు తరుగుతున్నా వంట చేస్తున్నా, కాస్త మాసిన బట్టలతో యింట్లోనే కనిపించినా కూడా ఆ విషయాలకు అధిక ప్రాధాన్యత యిచ్చి, అమితమైన జాలి ప్రదర్శిస్తూ, అవన్నీ అక్కా బావలు కావాలని కలిగిస్తున్న కష్టాలని వ్యాఖ్యానించే వాళ్లు. ఇంట్లో చిన్న పిల్లగా యింటి పనులు చేయటంలో తప్పేమీ లేదని, లక్షణంగా ఆ పనులు చేస్తున్నట్లు తను చెప్పేది.

కొన్ని కుటుంబాల్లోని విషయాలు ఉదాహరణలుగా చెప్పి, తనను అక్కా బావలు అట్లాగే పాడు. చేస్తారన్నారు, కొందరమ్మలక్కలు. సినిమాల్లో సన్నివేశాల్లాగా వర్ణించే వాళ్లు కూడా చివరికి తను కూడా అక్కా బావలు మాట్లాడే మాటలకు పెడర్థాలు తీసుకుంటూ కొంత ద్వేషభావం పెంచుకోవటం జరిగింది.

మంచి సంబంధాలు రెండు వచ్చి పిల్ల బాగుందని ఒప్పుకున్నా, యెక్కువ కట్నం డిమాండు చేయటం వల్ల, బావ వెనక్కు తగ్గాడు. హెచ్చు కట్నానికి తోడు, యింకా కలపాల్సిన కానుకలు, లాంఛనాలు, ఖర్చులు మొదలైన విషయాలు, ఉంటాయని తనకు తట్టనే లేదు. లోపల్లోపల అసహనంతో పేరుకున్న ద్వేషాన్నప్పుడు అగ్ని పర్వతం పేలి లావాను చిమ్మినట్లు వెళ్లకక్కింది "నువ్వు నాకు యీ జన్మలో పెళ్లి చేయవు. నేను నాశనం కావాలనే నీ కోరిక. చావుకు సిద్ధంగానే నున్నా" అంది బావతో.

అప్పుడు అమితంగా బాధపడుతూ బావ అన్నాడు "ఈ తడవ వచ్చే నీకు నచ్చే సంబంధం చేసి తీరుతానని ఘంటాపథంగా చెప్తున్నా. నీ మనవడ్ని యెత్తుకుని ఆడిస్తూ నన్ను చూపెట్టి వాడితో అంటావు చూడు, మనమిట్లా ఆడుకోటానికి యీ పెద తాతయ్యేరా కారణం అని" ప్రతిజ్ఞలాగే పలికాడు ఆ వాక్యం. ఆ మాటలు యిప్పుడు గుర్తుకొచ్చినై మాలతికి కళ్లల్లో ఆనంద భాష్పాలు కదిలినై.

పురోహితుల వారు, పళ్లెంలోని బియ్యంలో బాబు పేరు వ్రాయమనగానే 'రాఘవ' అని అనుకున్నట్లుగానే వ్రాశాడు, రామం. వినగానే అక్కా బావలు అదేమిటంటూనే ఆశ్చర్యంతో ఆనందపడిపోయారు.

మాలతి మనుమడ్ని యెత్తుకుని బావ దగ్గరకు వచ్చి ఆయన్ను చూపుతూ అంది, "మనమిట్లా ఆడుకోటానికి యీ పెద తాతయ్యేరా కారణం" అని.

బావ నవ్వుతూ అడిగాడు "అదెట్లా" అని.

"పాతికేళ్ల క్రిందట నువ్వు చెప్పిందే జరిగిందిప్పుడు బావా! నీ వాక్శుద్ధితో నీ ఘంటా పథానికి తిరుగు లేదు!" అంది మాలతి.

❋


# ప్రియదత్త

**సకుటుంబ సచిత్ర వారపత్రిక**

# 16-01-2002 సంచిక సంక్రాంతి ప్రత్యేక సంచికగా వెలువడుతుంది!

**ఈ సంచికలో ప్రచురణార్థం పంపే కథలు, కవితలు సచిత్ర వ్యాసాలు, కార్టూన్‌లు, జోక్స్ మొదలైన వాటిని డిసెంబర్ 15వ తేదీలోగా మా కార్యాలయానికి అందేలా పంపవలసిందిగా కోరుతున్నాము.**

- సంపాదకుడు